# ప్రతిబింబం

[కథానిక]

●

= శ్రీ ఏల్చూరి విజయరాఘవరావు =

౧

భార్య చనిపోయింతర్వాత అరుణునికి స్వంత వూళ్లో కాలు కదపడానికిష్టం లేకపోయినా, వున్న వూరువదలడానికి మనస్కరించలేదు. కమలినిని గురించి అల్లిన కల్పనాకథ లన్నీ మరచినట్టు శాంతిని పొందాడామె ఆఖరుక్షణాల్లో. కానీ—తనదిగా చలామణీ అవుతూన్న పదార్థ మేదో తనకు దూరదూరంగా తొలిగిపోతూ, శూన్యంలో అంతర్లీన మౌతూన్నట్టు తోచి భయం వేసింది... పేము బెత్తాలతో తమ చేతిని తామే చిరుదెబ్బలు చరుచుకుంటూ కదనుమీద పోతూన్న సోల్జర్లను చూచీ చూడనట్టు సాయంత్రం రోడ్డు ప్రక్కగా నడిచినప్పుడు, వారి జీవితాల్లోని నూటీదనంకూడా తనకు లేదేమో అన్న సందేహం మాత్రమే అతనికి స్ఫురించింది. చివరసారిగా చిత్రం గీస్తూ అన్నిటినీ వొక్క 'యిది' గా చిచ్చు పెడదామన్న వుద్దేశ్యంలో తన్ను తాను అర్థం చేసుకోలేదతను! అసలు తన చిత్రా లెవరిని వుద్ధరించడానికో అన్న దత నెప్పుడూ ఆలోచించని విషయం...

గది వూడ్చి మూడుదినా లైంది; దహనసంస్కారం మిషగా పని కల్పించుకు వచ్చిన బ్రాహ్మణ్ణి పంపించివేశాడు. చలి పుట్టినా తన చిత్రాలకు మట్టి కడ్డుగా కప్పిన పాత కంబళీ తను కప్పుకోడు. కమలిని పోయింతర్వాత పరదామూలగా వుంచిన దీపపుసెమ్మా మసి తుడవనుకూడా బద్ధకం వేసింది. ఓరాత్రి వీథిలాంతరుదగ్గర చదువుకున్నాడు. ఓరాత్రి ఆరింటికే నిద్రపోయినాడు. ఓరాత్రి యింటికే రాలేదు. తల్లినీ, తండ్రినీ, చెల్లెలినీ చూస్తూ చూస్తూ, నావీ అని చెప్పుకోదగ్గ నాలుగుగోడల మధ్య గడపిన జీవితాన్ని మరచిపోయే ఐదు సంవత్సరాలు కావస్తున్నది. యిల్లు విడచిన దెప్పుడో జ్ఞప్తికే లేదు! ఇంటి ముందుగా గీచిన 'ఉషాకన్య' బొమ్మలో ముద్దుగా పొదిగిన తన పేరు చూచుకుని, పెద్దమనుష్యులో, పేరున్న కళారాధకులో తనకోసం వస్తారని తనకు ఆశలేదు: వీథి చివరి బడిలోంచి రోజు కొక్క పసివాడైనా "మామయ్యా, నాబొమ్మ గియ్యవూ!... మామయ్యా, యివ్వాళ నేనూ, రోహిణీ కూచుంటాం...కలిపివెయ్యాలేం!" అంటూ తనకోసం వస్తే అదే తన జీవితాశయంలా—వొయారంగా—ఫలవృక్షంలా నేలకి వొరుగుతూ కుంచె అందుకుంటాడు. బడిలో చదివే పిల్లల బంధువు లందరూ అరుణునికి పరిచయమే. ఒకటో అరో ప్రతియింటిలో అతని చిత్రం వుంటుంది: తను అమ్మినవి కావు — పిల్లలకు పంచి యిచ్చినవి.

అన్నాడోకనాడతను తనలో తానే — వీథి మలుపులో జమీందారుగారి కట్టడం చుక్కల్ని లెక్క పెడ్తూన్నది — మాహేశ్వరీఆలయపు లాంతరుస్తంభం నీడలో కూర్చునివున్నాడు. "అదేకదూ నాకు కావాలి! నా పేరూ, నాచిత్రం ఆకట్టడంలో వుంది!"

ఆరాత్రి యింటికి వచ్చి సుఖనిద్రపోయినాడు. కానీ—జంతువులు నివసించ నిరాకరించే యింట్లో తానున్నాడని అతనికి కలైనా రాలేదు!

కృష్ణదాసుగారి పుణ్యమాఅంటూ వెళ్లినప్పుడల్లా భోజనం పెట్టమని వంటవాళ్లని ఫర్మాయించాడు ... ఎప్పుడూ యిక్కడికే వస్తున్నా డని వంటవాళ్లూ

జమీందారుగారితో చెప్పినట్టు లేదు. యిది కారణంగా అరుణునికి భోజనంగొడవ లేదనలేం...రాత్రి 'నందూ' రొట్టెలో కూర లేబోయినప్పు డనిపిస్తుంది: "ఈవేళ నాన్నా, అమ్మ యేం కూర చేసుకున్నారో!"

పాయసంలో పూరీ నంజుకుంటూ అంటాడు: "అవును...యిది కమలినికి మహాయిష్టం!"

చేతులు తుడుచుకుని వీథిలోకి వచ్చినా ఆనాటి వంటకాలను మరచిపోలేడు ... కొన్నాళ్లుగా దీని అర్థం వూహించుకుంటున్నాడేమో!

రాత్రి భోంచేశాక గదిమె ట్లెక్కుతున్నాడు పరధ్యానంగా. గొళ్లెపు సందులో కనుపడ్డ కాయితం -తా నుంచినది కాదని జ్ఞాపకం- తీసుకుని, సిగరెట్ పీక పారేస్తూ పెదిమలు కదిపాడు: "తర్వాత చదవచ్చులే"

ఆనాడు నేర్చుకుంటూన్న పసిపిల్లల చిత్రాలు దిద్దడంతోనే నిద్ర వచ్చింది. రాత్రి కమలిని కలలో వచ్చినట్టు స్మరించినా ప్రొద్దున్నే మరచిపోదామనుకున్నాడు. అద్దంలాంటి ఆమెవర్చస్సును కలగా త్రోసివెయ్యడానికి మనస్సు లొంగలేదు.

రెపరెపలాడుతూన్న కనురెప్పలను తుడుచుకుని, తూర్పువైపుకిటికీలో సిగరెట్ పెట్టికి వెతికాడు. తొమ్మిది గంటలైనా నిట్టమధ్యాహ్నపు సూర్యుడిలా వెలుగుంది బయట! అంతఆలస్యంగా లేచినందు కతను నొచ్చుకోలేదు; రాత్రి ఆలస్యంగా నిద్ర పట్టిందనీ, కలల మూలంగా అసలు నిద్రే లేదనీ అతనికి తెలిసివుంటుంది.

నిజానికి కమలినిగురించి అల్లిన కల్పనాకథలెంతమాత్రం బాధించలే దతనిని. ఐక్యసిద్ధి సూత్రాన్ని అర్థంచేసుకున్నది తన్ను తానే అర్పణచేసుకున్న దరుణునికి.

'తనంత తా వలచి' రావడమే అపనిందగా కన్పించచ్చు. అసలు చెట్టతప్ప మరోవిషయం చూడలే దేమో యీగ్రుడ్డిలోకం! ఆమెపట్ల లోకులు చూపే నిరాదరణకు అరుణుని హృదయోద్వేగం శుష్కించలేదు.

రంగుదారాలతో ఆమె అల్లిన పటం చూస్తూ అన బుద్ధివేస్తుంది అరుణునికి:

"దీపం ఆరిపోతుందా ఎప్పుడైనా! రెపరెపలాడీ ఆడీ అనంతతేజస్సులో కలిసిపోతుంది-అంతే"

-"లేవండి. భోజనానికి రావచ్చు. బాబుగారు వెళ్లారు."

పరుగెత్తబోయే కుర్రాణ్ణి పరాకుగా చూస్తూ గొణిగాడు: "అరే! ముఖమైనా కడగలేదే!"

కాలకృత్యాలు తప్పితే అరుణునికి చేయదగ్గ పని కన్పించదు కొన్ని దినాలు. ముగించడం అతని విధి. లేదా పొద్దు గడవదు. బడిసెలవుల్లో పిల్లలుకూడా రారు...చేతిగుడ్డతో ముఖం తుడుచుకుని పోయినాడు భోంచెయ్యను.

అన్నట్టు ఆదివారం ఆవేళ. రామూ చెల్లిని వెంటబెట్టుకు వస్తాడు- చిత్రం పూర్తిఅయిందనుకుని. మూంటు కొనను పైసాకూడా లేదని తెలుసు.

"నందూ, కృష్ణబాబుగా రెప్పుడైనా అవుసరం వస్తే మీకు డబ్బిస్తారూ?"

"హు ... వడ్డీతోసహా జీతంలో కట్టుకోమన్నాం మొన్న అక్కయ్యపెళ్లికి-పైమాటలే బాబూ ...ఏదీ! మీ రడుగుతే చెప్పలేం..."

డబ్బువిషయంలో అరుణుడైనా, నందూ అయినా జమీందారు కొక్కటే అన్న నిర్ణయం తనది. పని చేస్తూన్నందుకు నిజానికి నందూకే ఆదరణ చూపవచ్చేమో! "ఛీ...ఏం అడక్కపోతే!" — స్ఫురించిన భావాలకు వూతంగా చెయ్యి జేబులోకి వెళ్లింది. 'కరెన్సీ' యేమోని అథాట్టుగా తీశాడు.

"అరుణ్, నమస్తే. మీకోసం వచ్చివెళ్లాను. చెల్లిదగ్గర బళ్లో మీచిత్రం చూచాను. బాబుగారితో మాట్లాడారుట కూడా ... నేర్చుకోవాలని వుంది. క్షమించి యింటో వుండండి రేపు—శాంత"

అరే! క్షీరసాగరంగారి కూతురుకాబోలు. రాచవాళ్లమ్మాయి. రాత్రి మరిచేపోయాను చదవను... "నందూ! యివ్వాళ పెరుగు వద్దోయ్."

చేయి కడుక్కుని బయటికి వచ్చాడు. దూరంగా గదివైపుకు చూచాడు. ఎవ్వరూ వున్నట్టు లేదు. ఇంకా రాలేదేమో అని త్వరగా అడుగులు వేస్తున్నాడు. గదిమెట్లెక్కుతూంటే గొళ్ళెంలోంచి మరో కాయితం కనిపించింది.

"...యింత ఆలస్యంగా యెక్కడికి వెళ్లారో తెలీదు. ఆలయానికి పోను కారు వచ్చివుంది. రెండింటికి చూడండి నాకోసం. శ్రమ కాదుగదూ!— శాంత"

నవ్వుకున్నాడు. పిచ్చిపిల్ల! యీ 'టెక్నిక్' యేమిటో! క్షణమైనా కాచుకోనుండరాదూ!

—"అరూమామా! నవ్వుతున్నావేం... మేం వచ్చేశాం"

వెనక్కు తిరిగాడు అరుణుడు. బొత్తాములు పెట్టుకుండానే సూటూ, గౌనూ తొడుక్కుని వచ్చేశారు హడావిడిగా రామూ, రోహిణీ. బడికి సెలవనీ, యిస్తామన్న చిత్రం తీసుకుపోవస్తున్నామనీ ముందే చెప్పి వుంచారు. వచ్చారు.

రోహిణిని ముద్దుపెట్టుకుంటూ అన్నాడు రామూతో—"బజార్లో మాంట్లుఅయిపోయినాయమ్మా. చూడూ...చిత్రం గీచివుంచాను. ఆనక వెళ్లి కొని తప్పక పంపిస్తా. కోప్పడకేం!"

'ఊహూ'—ఏకగ్రీవంగా అన్నారు రామూ, రోహిణీ.

"యిదుగో, నాన్న యిచ్చారు అర్ధణా...డబ్బుకోసం చూస్తున్నావేం! యింద...మధ్యాహ్నం తప్పదు"

"సరే...యేదీ అర్ధణా" – చెవులు గిల్లుతూ జేబులో వేసుకున్నాడు.

గణించిన లోకజ్ఞానాన్ని సద్వినియోగం చెయ్యడం మానవుని చిత్తప్రవృత్తి. అదే అతని చూపూను. ఈ ప్రవృత్తి కతీతమైందేదో అతనిలో వుందేమో! అందు కతడు పిచ్చివాడూ కావచ్చు; వేదాంతీ కావచ్చు! అర్ధణాతో కొనదగ్గ 'మాంటు' యేదీ లేదని అతనికి తెలీదనలేం. తీసుకోవడం దేనికో నిజంగా!

"రామూ! ఎప్పుడూ అదే పనా? సగంకాలం నీవల్లనే వృథా అవుతున్నది వారికి. పొండి. అమ్మ ఆపిల్సు కొంటున్నది"—కారుశబ్దం కొత్త గాకపోయినా బెదురుగా వెనక్కు తిరిగారు పసివాళ్లిద్దరూ. వెలిగించబోయే అగ్గిపుల్లను దాచేస్తూ గుమ్మంవద్దగా నుంచున్నాడు అరుణుడు. "రండీ. ఫర్వాలేదు"

మెట్లముందుగా గంతులువేశారు వెనక 'సీటు' లోకి రామూ, రోహిణీ. "గోపల్, కారు పోనీ. అక్కయ్యకోసం మళ్లీ వద్దువుగాని లే"

కారు సగందూరం పోయాక అడిగింది రోహిణి :

"గోపల్! అక్కయ్య దేనికీ వచ్చింది! మమ్మల్ని వెదకడానికా..."

"కాదమ్మా...చిత్రాలు నేర్చుకోవడానికి"

౨

"చూడండీ...నేను చిత్రలేఖనం నేర్చుకోవడానికివచ్చాను."

"అల్లాగే"

"మరి పరీక్షిస్తారా?"

"అల్లాగే."

"బయట మీ 'ఉపాకన్య' చిత్రాన్ని కాపీ చెయ్యనా?"

"ఊఁ"

శాంతకీ మూకీభావం అర్థంకాలేదు. క్రొత్త కావడంవల్లనేమో అని సమర్థించుకుని గీస్తోంది చిత్రాన్ని.

"పాపం! కమలిని పోయిందిటగాదూ ... విన్నాను. సంపూర్ణ అన్నాడు మొన్న—"

'ఊహూ...'— వింటూన్నప్పుడే ఆలోచనలో వున్నాడో ఆమె గ్రహించలేకపోయినా సంపూర్ణ నుదాహరించుకున్నందుకు మూతి ముడుచుకున్నట్టు స్ఫుటమైంది. అతను కమలినికి తమ్ముడుగా జన్మించినందుకు అరుణు డెన్నిమార్లో చింతించిన మాట నిజం. లోక మెంత ఆడిపోసుకున్నా సౌశీల్య ప్రవర్తనే కమలినిఅంతర్జీవితాన్ని నిర్మించింది.

లోకు లెంత ఘనంగా చూచినా దరిజేరనివ్వడు సంపూర్ణను అరుణుడు. కారణం-అభిరుచులు భేదించడమే కాదు; అసత్యజీవనాన్ని అసహ్యించుకోవడమే.

పూర్తిచేసింది చిత్రాన్ని విచిత్రంగా. చుక్క కూడా పొల్లుపోలేదు. తొణకకుండా చూస్తూ అన్నాడు అరుణుడు: "రోజూ వస్తారుకదూ?"

"అల్లాగే. అభ్యంతరం లేకపోతే"

"మరి నేను సెలవుపుచ్చుకోనా?"

'ఆ.'—గుమ్మందాటి గదిమెట్లదాకా వెళ్లింది సందేహిస్తూన్నట్లు. అరుణుడు తిరిగి పిలిచినట్టు లేదు. ఓరగా చూస్తూ అంది:

"అయితే యెంత పుచ్చుకుంటారూ సెలకు?"

"రామూకు మాంటు కొనుక్కురండి చాలు... అన్నట్టు చాలా పుచ్చుకుంటాను—చెప్తాను తర్వాత."

నవ్వుకుంటూ కారుతలుపు తెరిచింది.

'భావకవి!!'

*         *         *

"గోకుల్, నాకోసం యెవరేనా వచ్చిపోయినారా?"

"ఆ...సంపూర్ణ. రోహిణమ్మగారితో మళ్లీ వస్తానని చెప్పినట్టుందమ్మా"

"సరే. త్వరగా పద" వేగంగా కదులుతూన్న కారుచక్రాల నురుపిడి రేగిన దుమ్ము పొరలుపొరలుగా ప్రక్కన్నే సాగిపోతూంది. దరిద్రుడి నుదుటి రేఖల్లో చెదిరే కురుల్లా సుడిగాలికి రాలిన యెండుటాకు లెగురుతున్నాయి. వీథిమలుపులో వెనక్కు తిరిగి చూచింది శాంత అధాట్టుగా అద్దంలోంచి. శిలాప్రతిమలా నుంచునివున్నాడు అరుణుడింకా, కారు చారల్లో దృష్టి నిగిడ్చినట్టు!

కృష్ణాంబుదచ్ఛాయల్లో తళుక్కున విద్యుల్లతలు వెలగడం సృష్టివైచిత్ర్యమే. కాంక్షాకాంతులు స్పృశించని జీవితాలకు రెప్పపాటులో నవ్యజ్యోతులను చూడగలిగే ఆశ పొటమరించడం అనూహ్యమేమో! కానీ- నివురుగప్పిన నిప్పులో వెలుగు బాహ్యప్రపంచానికి అవగతం కాలేదని దానిలో వెలుగు లేదనలేం.

మసకపొరల్లో దృష్టులు గుచ్చుతూ అనుకున్నాడు: "కళామూర్తి ఆమె!"

శాంత యింటికి వెళ్లగానే సంపూర్ణ మళ్లీ వచ్చాడు. ఆమెతండ్రి క్రొత్త బంధువుల కుటుంబంలోంచి వచ్చినవాడని గౌరవంగా చూస్తారతన్ని శాంత యింట్లో. అసలు వ్యక్తిగతంగా కమలిని తమ్ముడన్న ఆదరం ముఖ్యమై వుండచ్చు. అతన్ని అర్థం చేసుకున్న ప్రతి అణువూ అతని దరి జేరడానికి నిరాకరిస్తుంది. ఆ అర్థం చేసుకోనివ్వడమే అరుదు. వేపాకుకు చక్కెర పులిమి అందించగల విధానాలెన్నో తెలుసు అతనికి.

అడిగిందామె- "బాబూ! మీ 'ఎగ్జిబిషన్' మాటేమిటి?"

"అదే ఆలోచించడం. వచ్చే మాసానికి సిద్ధం అవుతుందని అంచనా. పట్నం వెళ్లి అనేకులకు చెప్పివుంచి వచ్చా. ఆర్థికసహాయం కూడా లభించవచ్చు. మరీ...నీ చిత్రాలమాటేమిటి?"

"నా చిత్రాలదేమిటీ- ఉడుతభక్తిలా అప్పటికి చూచుకోవచ్చు. అరుణుణ్ణి అడగలేదూ..."

"హు! అంతలోటుగా కన్పిస్తే నే గీస్తాను. అతన్నడగడం అసంభవం"

అసలు సామాన్యమానవునిలో సృష్టి వైపరీత్యం చూడగోరడం పొరబాటే. ఎటోఎటో పోతూన్న తుమ్మెద పరిమితిలేని పరిధుల్లో తామరల నాఘ్రాణిస్తుంది. అనతిదూరంలో కుప్పిగంతులు వేస్తూన్న కప్పకు అవగతమేకా దావాసన. అరుణునివంటివున్నతవ్యక్తి తమ మేడల నీడల్లో పరాకుగా పచార్లు చేస్తూంటే కాదని త్రోసిపుచ్చి- అందని మ్రానిపళ్ల కాసించడంలో సంపూర్ణ చూచే ఆనందం శాంత కర్థం కాలేదు.

"శంఖాల్లాగా, భస్మీభూతమైనా తేజస్సువిడవని జీవితాలెన్ని లేవు!" అదే అప్పటి ఆమె మందహాసాని కంతరార్థం.

"సరే. కానివ్వండి. కానీ– మొన్న ఊబుసుపోక కథను గీచిన చిత్రం చూస్తే...రామూ!"

డ్రాయింగు పుస్తకం విసురుగా గిరాటు వేస్తూ పరుగెత్తివచ్చాడు రామూ. "యేమిటే... చెప్పు త్వరగా."

"మొన్న అరూ మామ మీ కిచ్చిన బొమ్మ యేదీ?"

"'కచ దేవయాని' కదూ ... దేవుడిపటాల దగ్గర పెట్టిం దమ్మ. నాన్నగారి కెంతో బావుంటే అలా చేయమన్నారుట. అయినా, నాకిచ్చిన బొమ్మ వాళ్లు లాక్కోవడం అన్యాయంకాదుటే"

"పనిలేదు...తర్వాత చూడచ్చులే—"

పరాకుగా అన్నాడు సంపూర్ణ. కమలిని పర లోకగత కాకమునుపే 'బావా' అని పిలవడం అరుదు. పసివాళ్లు నోరారా 'అరూమామా' అని పిలుచుకుంటే సహించలేని యీర్ష్యాగ్ని లతనిలో వున్నవని శాంత గ్రహించలేకపోయినా ఆతని వాలకాని కర్థం వుండక పోదని మాత్రం వూహించుకుంది.

చివరకు ఆమె అన్న మాట ఒక్కటే — 'మీ యిష్టం.' ఆనాటి కా సంభాషణ ముగిసింది.

ఇప్పుడు రోజూ శాంత అరుణునివద్ద చిత్రాలు నేర్చుకుని వస్తుంది. పాపికొండల కరకుహృదయంలో పాలరాతినిగనిగలు పొదిగే వున్మనలూ—గర్జించే సింహం వర్చస్సులో గోముఖప్రసన్నత దిద్దే చాకచక్యమూ అరుణుని కలవడిన విధాలు ఆమె కవగాహన మవుతున్నా యిప్పుడిప్పుడు.

'మీరు' అని పూర్తిచేయా లనుకున్న వాక్యాల్లో తడబాటు చూచి నవ్వుకునేది మొదట్లో. 'అరుణ్' అని పేరుపెట్టి పిలవనూ పెదిమలు కదలవు కొన్నిదినాలు. అభిమానాన్ని మించిన అవ్యక్తావ్యక్తమైన మధురభావ మేదో ఆమెను పీడిస్తున్న దనడానికి సంసిద్ధులం కావచ్చు. కాని వొప్పుకో దామె.

తుడిచితుడవనట్లు అతికిన దుమ్ము నూదుతూ, పుస్తకాల బీరువామీది చిత్రాన్ని ప్రశంసిస్తుం దొక నాడు. "ఎంత బావుందబ్బా! ఏకొద్దిమందికో దత్తరాలు యిలాంటివి"

"ఓసారి ప్రమిదలు తుడిచి వత్తి వెలిగించిపోదురూ...బట్టలంతా నూనె పోసుకున్నా"-అరుణుడు పిలిచిన పిలుపుకు ముఖమైనా యెత్తకుండా సమాధాన మిస్తుం దప్పుడప్పుడూ: "అల్లాగే. యిక్కడ పెట్టిపోండి"

అన్నాచెల్లెళ్లులా వారిద్దరూ మెలిగిన దినాలు లెక్కపెడదా మనుకుంటుంది. ఏకోదరత్వానికి భంగంగా పలికిన యేవొక్క ముక్కో జ్ఞాపకం తెచ్చుకుని ఆమె ముడిచిన వేలు పైకి తీయిస్తుంది. విశిష్టప్రేమకు రూపం లేదని వాదిస్తా రామెలోంచి యెవరో!

కొన్నాళ్లుగా అరుణుడూ తనకు తెలియకుండానే శాంతలోని సుహృదయాన్ని చూస్తున్నాడు. భార్య పోయినప్పటినుండీ అపావృతమైన పథాల్లో యేకాకిగా నడుస్తూన్న అతనికి భయం వేస్తున్నా దిప్పుడు తోడెవరూ లేరని. అధీనునిలా ఆధారాని కెదురుచూస్తాడు. ఈఆశ కల్గించిన దెవరో అతనికి తెలిసినా ప్రశ్న వేసుకుంటాడు తరచుగా. కానీ ... పోయిన పంచమినాటి వెన్నెట్లో చుక్కల్ని లెక్కపెడ్తూ అనుకున్నది ఒక్కసారే అతను.

"నేను కమలినిని మరచిపోలేదు కదా"

ఈసందేహం కలగడం యిదే అతనికి మొదటిసారి! వ్రాసిన తప్పును కొట్టివేస్తున్నట్లు గాలిలో వంకరలుగా చేయి విసిరాడు. "ఛీ...ఎప్పటికీ కాదు"

సాయంకాలం కారులో షికారు రమ్మంటుంది శాంత. నిక్కచ్చిగా 'వద్దని' అడ్డుచెప్పిన రోజూ కద్దు. 'రాలే'నని మెత్తబడిన దినమూ కద్దు...పోయిన దిన మొక్కటీ కన్పించదు. నిజాని కెంత చనువుగా వర్తిస్తూన్నా చిన్న విషయాల్లో స్త్రీని మెప్పించడం పరిపాటీ కాదని అరుణునికి తెలియదేమో అని విచారించేది శాంత..."ఆకాశమంత ఆలోచన లిమిడిన బుర్రలో యీ చిన్నపాటి విషయం నిలవదా" అన్న సందేహం ఆమెకు లేకపోలేదు. లౌకికుడు కాడని తెలిసీ, పట్టుపట్టడంలో ఆమెదే లోపంగా గ్రహించుకుని వూరుకుంది.

వెలుగు నిస్తూన్న క్రొవ్వువత్తి తనలో తానే దిగజారుతున్నది.

శాంతను చూస్తూ సర్వావసరాలూ మరచిపోగల అరుణునికి తన్ను తాను చూచుకున్నప్పుడు యావజ్జీవాలూ క్రుంగిపోతాయి...శాంత ప్రక్కన్నే లేందే చిత్రం గీయడాని కుపక్రమించలేడు...అప్పుడు తాను మొదలుపెట్టిన 'స్వప్నసుందరి' చిత్రానికి కుంచె అందుకుంటే యెవరో ఛాయగా తన్ను పల్కరించి నట్టు కలగంటాడు.

"అలసివచ్చారు. కొంచెం విశ్రాంతి తీసుకోరూ...ఏమిటల్లా చూస్తారు! నేనే...మీ కమలినిని"

ఇప్పు డతని కీఅంతర్వాణుల్లో అభిమానం తగ్గింది. వినిపించుకోకుండా చిత్రం గీయగలడు. కళ్లకు కడుతూన్న బొమ్మ నీభావా లేవీ చెరుపలేనంత ఏకాగ్రత!

"బాబూ..."

"అవును...తే"—ఎప్పుడో మరచిపోయిన దస్తూరీ చూడగానే ప్రాణం లేచివచ్చింది అరుణునికి. ఇంటినీ, యింటికి వేసిన కప్పునూ మరచిపోగలిగాడే కాని, నివసించే తన తల్లీ, తండ్రీ కనుపాపల్లో ఆడా రావుత్తరం చూడగానే.

విప్పి చదువుతున్నాడు — విశాలమైన నుదురంతకంతకూ ముడిబడుతున్న దేం! వ్రేళ్లమధ్య వుత్తరం బెదురుచూపులు చూస్తున్నది ... చూస్తూ—అలసిన ప్రయాణీకుడిలా-ఆకలిగొన్న ఆడలేడిలా వొక్క నిట్టూర్పు విడిచాడు—"అబ్బా! అయిదువందలా!"

తండ్రి తీవ్రవ్యాధిపాలైనాడట! చెల్లెలి కింకా పెళ్లే కాలేదుట!—తమకు లేని పెడద సంఘానికి పట్టిందిట! అరుణుని పెళ్లికి గాను చేసిన అప్పు కొండల్లే పెరిగిపోయిందిట! దానికి తా మున్న కుటీరం తాకట్టుకు పోతున్నది ... కడసారిగా 'కొడు'కన్న సంబంధం సార్థకం చేసుకోగలిగితే శాంతంగా మరణిస్తా నన్న తండ్రి మాటలు వుదాహరించింది అమ్మ!

సగం పూర్తి అయిన చిత్రంపైపు చూస్తూ అన్నాడు : "నీవే నన్ను పోషించాలి"

ఆనాడు మరింత వుత్సాహంతో చిత్రం గీచాడు. చిన్నతనపు గృహజీవితాన్ని ఆకళింపుకు తెచ్చుకున్నప్పు డెంతో బాధపడినా, కార్యదీక్ష ఆబాధలను కప్పివేసింది. సంయమికి మించిన మనోబలం తాండవిస్తున్నది కనుబొమల వంకరలలో. "జమీందారు నడిగి లాభం వుండదు...శాంత నడగనే అడగను. నా చిత్రం నాకు యిప్పించాలి".

మధ్యాహ్నం శాంత వచ్చినా పాఠాని కుపక్రమించలేదు.

"శాంతా, ప్రదర్శనం మాటేమిటి?"

"మరోపక్షం రోజుల్లో జరుగవచ్చు. కానీ-"

పూర్తికానివ్వకుండానే అంటున్నాడు—

"నా చిత్రాలు పంపుతున్నా. డబ్బిస్తారా?"

అతని అప్పటి అమాయకత్వాన్ని చూస్తే గుండె చెరువవుతుంది! మెల్లగా అంది శాంత: "అంత అవుసరంవుంటే నే—"

"కాదు. పంపించి తీరాలి. సంపూర్ణ వొప్పుకోడా?"

జవాబుకు సందేహిస్తున్నది శాంత.

"తప్పక పంపుతాను. సంస్థానాధీశ్వరు లెవరో చూడవస్తారుటగా?"

"అవును. పంపించండి...నేనుకూడా పంపించ దలచుకున్నా. "

"నిజమే...నా 'స్వప్నసుందరి' — నీ...నీ యిష్టం వచ్చిందీను."

## 3

చిత్రాలను శాంతయింటికి బండెక్కించుతూ, తలుపు వెయ్యబోతున్నాడు అరుణుడు. మరణశయ్యమీది తండ్రిని బ్రతికించడమే కాకుండా 'మనదీ' అనిపించాలి అప్పుక్రింద పోతూన్న కుటీరాన్ని ... అబ్బ! తనలాగా యెందరెందరు బాధపడుతున్నారో దేశంలో!

అరుణు డింతవరకూ డబ్బువిషయాల్లో జోక్యం కలుగ జేసుకోలేదు. తల్లి వ్రాసిన ఆ ఒక్క వుత్తరం

ఎంతలో యెంత మార్పును తెచ్చిందీ! అసలు తన చిత్రాలమీద డబ్బు వస్తుం దన్న ఆశ కలగడం తనకే విచిత్రం.

ప్రక్క యింటి స్నేహితుడు వీపుతట్టా డింతలో.

"ఒక్కసారి తలుపు తీస్తారూ"

"ఆ...ఏం?"

"చెప్తాను...తీద్దురూ"

ఊసుపోని దినాల్లో అరుణు డితనితో మాట్లాడ డం కద్దు. అదే వీరి మిత్రత్వం. అతని సంభాషణలవల్ల యిన్నాళ్లకు అరుణుడు గ్రహించిన దొకే విషయం—"పనిచెయ్యలేని పెద్ద మాటకారి" అని...అంతకన్నా గ్రహించదలచుకోలేదేమో అసలు!

"యీ సామాన్లు మీయింటో వుంచుతాను కొన్ని దినాలు"

"అల్లాగే"

పెట్టివుంచి యేమీ చెప్పకుండా వెళ్లిపోయా డతను. పాము కరిచినా చెప్పి కరుస్తుం దంటారు! హడావిడిగా యిలా పెట్టివెళ్లడం గమ్మత్తుగానే వుంది అరుణునికి. ఏమి దాచివెళ్లాడో తన కనవసరం అనే అతడు తిరిగీ వాటి విషయం ఆలోచించ లేదు.

నవ్వుకుంటూ తలుపు వేశాడు.

—అప్పటికే బ్రహ్మాండమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి 'ఎగ్జిబిషన్' విషయమై. పరులపలుకు బడీ తనదిగా చేసుకోగల మధ్యవర్తిత్వపు కీలకా లెన్నో దొరుకుతాయి సాధారణంగా; సంపూర్ణ కివి సరిపడని సంగతులు కావు. ఆ చిత్రప్రదర్శనాన్ని యేర్పాటుచేయడంలో ముక్తీ, రక్తీ చూడం దతనికి నిద్రరాదు.

గొప్పవార మని భ్రమపడుతూన్న చిత్రకారుల కొందరినో పిలిపించాడు. వున్నతస్థానాల నలంకరింపించాడు వారి చిత్రాలను. అరుణుని పిలవడాని కతనికి నోరాడనేలేదు. స్త్రీ అన్న అభిమానమే శాంత నతడు పిలవడానికి కారణ మైవుండచ్చు. అంతకు మించి ఆమెనుండి అత డేమైనా ఆసించాడేమోఅన్నదీ ఓ విషయమే.

సంస్థానాధీశ్వరులూ, సర్వాధికారులూ దేశ దేశాలనుండీ చూడవస్తున్నారు ప్రదర్శనాన్ని. ఆరాత్రి అరుణుడు తీయని కలలు కన్నాడు; తండ్రిఆశయ సంపూర్తికి దోహదం కాగల నన్న ధైర్యం అతనిలో వుబికిపోతున్నది!

ప్రొద్దున్నే శాంత కన్పించింది మళ్లీ.

"అరుణ్..."

"ఆ"

"మన చిత్రాలు తీసుకో నన్నాడు సంపూర్ణ — నీవి తీసుకోందే నా వివ్వనన్నాను." జాలిగా అంది.

భయం వేసింది అరుణునికి. మరి తన యింట్లో యేమయ్యేట్టు! శాంతను అడిగితే ... ఛీ! యిన్నాళ్లుగా ఆమెమిత్రత్వం తన తుచ్ఛపు అవసరాలను తీర్చుకోవడానికి నియోగిస్తాడా...కానీ...తప్పనట్లుంది — తండ్రిపంచప్రాణాలూ నీలినీడలుగా సోకినై అరుణుని హృదయంలో.

దిగులుగా కిటికీలోంచి చూస్తూ శాంతను పిలిచాడు. ఏదో ఆశ అతన్ని కదిలించిం దప్పుడు.

"మరీ—" అడగదలచుకొన్నది నోరాడ లేదు.

"చెప్పండీ...డబ్బా!"

"కా...దు—ఏం చేదామంటావ్ శాంతా ... ప్రదర్శించాలి—"

"...ఊ..."

శాంతకు గ్రుడ్లలో నీళ్లు తిరిగినాయి. ఇన్నిదినాలుగా అతనితో కలిసిమెలిసి తిరుగుతోంది కానీ, అతనికీ తనకూ వున్న సంబంధం మరెప్పుడూ ఊహించుకో లేదు. కనికరానికీ ప్రేమకూ భేదం లే దసలు. అరుణుని జాలిచూపు లామెను ముక్కలు చేసినాయి. తన కళ్లలో మెరిశా డతను...ఒక్కసారిగా ముద్దు పెట్టుకుందా మనుకుంది. కానీ! అడుగుదీసి అడుగు వేయలేకపోయింది. అరుణునిలోనూ అదే యుద్ధం రగులుతూన్న దని ఆమెకేం తెలుసూ...పిచ్చిపిల్ల! దెబ్బతిన్న హృదయం వుపశాంతిని కోరడం సహజమే.

రామూ పిలవడంతో వీరి ఆలోచన లొక్కసారి సద్దుమణిగాయి. "అక్కా, సంపూర్ణ మనింటికొచ్చాడు. మాట్లాడాలిట మీతో."

"పొమ్మను. యిప్పుడు రాను. పనుంది."

ఆలోచించకుండానే అనేసిందా ఆవేశంలో... తనకు అప్పుడైన అరుణుని చిత్రాలు స్వీకరించడానికే వెనుదీసే పిచ్చివెధవలంతా తనకు స్నేహితులు.

రామూ వెళ్తూంటే అన్నాడు అరుణుడు: "శాంతా, నా 'స్వప్నసుందరి' అతను చూశాడా?"

"లేదు. చూపించలా."

"అతనే చూచి అడగనందుకు సిగ్గు తెచ్చుకుంటాడు లే...ప్రదర్శించి తీరుతాను. అన్ని చిత్రాలూ లోపలున్నా నాచిత్రాలు బయట వుంచడానికి కృష్ణబాబుగారేమీ అడ్డు చెప్పరు. మరొకరి అధికారం నా కనవసరం."

"సరే. మనిద్దరివీ. ఎవరేమన్నా అననీ."

పొంగిపోతూన్న ఆవేశంతో నుంచున్నాడు అరుణుడు. తన యింట్లో తాను గీచిన చిత్రాలే తనకు సాక్షులు. ఒక్కసారిగా శాంతను ముద్దుపెట్టుకున్నాడు. ఇద్దరూ ఐక్యమైనట్లు అత్యంతశాంతిని పొందిందామె.

ఓరగా యిద్దరి వెనుకగా గోడనున్న రంగు దారాల పటం గాలికి గలగలలాడింది అటూ ఇటూ. పటంమీది జిలుగుఅక్షరాలు జ్ఞాపకమే రాలేదతనికి.

'క...మ...లి...ని...'

సిగ్గుగా క్రిందికి చూస్తూ బుగ్గ తుడుచుకున్నది శాంత. ఎర్రని చిరునవ్వు పెదిమలు మారుని విల్లులా వంపు తిరిగినవి.

"సరే వస్తాను"— క్షణం చూచీ చూడనట్లు నుంచుని వెళ్లిపోయిందామె. చీకటిలో దోగాడే పసిపాపలా వొంటరితనపు భయం వేసింది అరుణునికి.

శాంత కెదురుగా వచ్చారు రామూ, రోహిణీ యింట్లో.

"అక్కా, పిచ్చిపని చేశావే."

"ఏమీ లేదు. పోండి".

"కాదక్కా. సంపూర్ణ అరూమామవీ, నీవీ చిత్రాలు అడగడానికి వచ్చాడుట. నిన్ను పిలిస్తే రాలేదేం! కోపం వచ్చి వెళ్లిపోయాడు."

"పోనీ—మీరుకూడా పోకపోయారూ..."

అనగలిగిందేగాని కించిత్తు బాధపడినమాట నిజం.

* * *

ప్రదర్శనం జరుగుతోంది. చూడవచ్చిన ప్రజ క్రిక్కిరిసింది. కృష్ణదాసుగారి భవనంలో తీర్చివున్నారు జనం. భవనంముందుగా ఖాళీగదిలో శాంతా అరుణుల చిత్రాలు పెట్టివున్నాయి... తూర్పుబడిలో పిల్లలందరూ గదిలో మూగివున్నారు; వద్దన్నా పోయే వారి నందరినీ పిలిచి 'మామయ్య' చిత్రాలను చూపిస్తున్నారు. శాంత 'ఇదమిత్థ'మని విప్పిచెబుతోంది బొమ్మల్నిగురించి. అరుణు డేడీ! అంత గుంపులో తాను వొకడై చూస్తున్నాడాప్రదర్శనాన్ని.

పంపించిన కళారాధకుల పేర్లు చూస్తే...అరే! 'అనిలుడు—విజయుడు—పద్మాదేవీ—మనోజ్!!'

అరుణుడు స్వగ్రామంలో వున్నప్పుడో స్నేహితబృందం వుండేది. వారితని దగ్గర నేర్చుకుంటూండగానే తనకు వూరు వదలివెళ్లడం తటస్థించింది. తర్వాత వారి విషయం విని ఎన్నోదినాలైందితడు. గొప్ప వుద్యోగాల్లో వున్నారని వినికిడి. కనుపడీ, పలుకరించకపోరనుకుని తిరిగి వెళ్లాడు.

అనుకున్న సంస్థానాధీశ్వరు లప్పుడే చూడ వస్తున్నారు. ప్రాంగణంలో కార్లు ఆగినాయి. సంపూర్ణ పూలదండలతో వారి నాహ్వానించాడు. లోపలికి త్రోవ చూపుకుంటున్నాడు.

ముందుగా అరుణుని చిత్రాల గది తగులుతుంది లోపలికి వెళ్లను.

పసివాళ్లొక్కుమ్మడి దణ్ణాలు పెడ్తూ 'రండీ' అన్నట్టాహ్వానించారు పెద్దవాళ్లను!

రహస్యంగా కళ్లెఱ్ఱచేస్తూ పసివాళ్లను ఝళిపించాడు సంపూర్ణ. చేతులు తమ ప్రదర్శనంవైపుకి త్రిప్పుకుంటూ అన్నాడు—"ఛస్ వెధవల్లారా."

భయపడి వూరుకున్నారు పిల్లలు. లోనుండి చూస్తూన్న శాంతకు గుండె నీరైంది. గుంపులో వెనుదిరిగి ఆలోచిస్తూన్న అరుణుని కీసంఘటనే తెలియదు!

"చూచిరాకూడదూ...పసివాళ్లుకోరుతున్నారు పాపం!"

దేవుడి ఆజ్ఞ అయినా పూజారి సెలవివ్వద్దూ! సంస్థానాధీశ్వరుల మాటను సర్దుతూ అన్నాడు సంపూర్ణ—"ఏమున్నది లెండి లోపల. పిల్ల వెధవలు—గోలకి తలబడితే అంతే..."

పాదా లాముంగుగదిలోకి బోసుంకించినా త్రిప్పుకున్నారు పెద్దలు ... చిత్రాలు చూచారు ... కొనమనిన వన్నీ కొన్నారు...వేలను మ్రింగినా యీ సంఖ్యలు! తిరిగి వెళ్లిపోవడమూ అయిపోయింది.

"తర్వాత ఎటునుంచో వస్తూ శాంత నడిగాడు అరుణుడు—"శాంతా, ఎవరూ కొనలేదూ?"

ఈమధ్య జరిగిన విషయా లతని కేమీ పట్టవు.

'స్వప్నసుందరి' చిత్రంవైపు చూస్తూ కుమిలి పోయింది శాంత..."అబ్బా! మీామతి పోయింది"

"ఏం?"

"స్వప్నసుందరిట...నా బొమ్మ గీశారు!!"

ఆశ్చర్యంగా—తీక్ష్ణంగా చిత్రాన్ని చూస్తున్న అరుణుడు చిత్తరువులా స్తంభీకృతు డైనాడు... తాను స్వప్నంలో చూచింది శాంతనా!!—పోల్చుకున్నకొలదీ కళ్లు చెదిరిపోతున్నాయి! ముందునుంచున్న శాంతా, ఆచిత్రమూ అచ్చుగుద్దిన ట్లున్నాయి.

మెల్లగా అడిగా డతను ప్రశ్నార్థకంలా వంగుతూ—

"పోనీలే...నీ కెల్లా తెలిసిందీ!"

"పోతూపోతూ సంపూర్ణ చూచాడు... అట్టహాసంగా క్రూరపు నవ్వులు నవ్వి హేళన చేశాడు 'శాంతమ్మగారు స్వప్నసుందరా!' అని."

ఇక చెప్పలేకపోయింది శాంత. కళ్లకి కమ్మిన నీరులో హృదయం లేని లోకం తన వికృతాకారాన్ని చూచుకుంటున్నది.

"చింతించకు శాంతా...ఇంటికి వెళ్దాం పద"

ఆనాటికి శాంత నింట్లో దించివచ్చాడు. అగమ్యగోచరంగా వుం దతనికి. అధీనంతప్పిన జీవితపు కళ్లెం పట్టివుంచను అదిరిపోతున్నా యతని హస్తాలు.



యింట్లో కమలిని పోయిననాటి శాంతికూడా లేదాదినం!

అప్పటిలో మెరుపులా మెరిసిన ఆలోచనల బలంలో ఓరవాకిలి గడియ 'టక్కీ' మని బిగించి వచ్చాడు...నీలిమబ్బుల్లో ద్యోతకమవుతూన్న యింద్ర ధనస్సు రంగులను పోల్చుకుంటూ...అన్నిటినీ కలిపి వుంచాడు. ఆఖరుసారిగా తను గీయబోయే చిత్రం అదే. జన్మ సార్థకం కావాలి...

ఎవరో తలుపు బాదా రింతలో. స్త్రీకంఠం.

మారుగొంతుకతో జవా బిచ్చాడు:

"ఇంట్లో లేరు వారు"

చిత్రం మొదలుపెట్టాడు. గంభీరంగా కదలిపోతున్నది కుంచె. నెలల తరబడి గీచినా పూర్తిగాని చిత్రా లనేకం వున్నా యతని దగ్గర...నిమిషాలమీద గీస్తూన్నా యీ చిత్రాన్ని చూస్తే అతన్ని సామాన్య మానవు డనుకోము: దిక్కులు చూస్తూ రేఖలు దిద్దుతున్నాడు; కలిపిన రంగులు కలపకుండా అంచులు దిద్దుతున్నాడు.

తలుపుశబ్దం అధికమవుతున్నది. అదే స్త్రీ కంఠం.

"వచ్చారా"

"ఊహూ, రాలేదు"

గావుకేక వేస్తున్న దామె—"అరుణ్...నేనే నీశాంతను...ఒక్కసారి తలుపుతీ...క్షణంలో నీవు నావాడివి కావు...తలుపు తియ్యవూ..."

విన్పించుకోకుండా చిత్రం గీస్తున్నా డరుణుడు.

"అవును, మగవారి హృదయాలు శిలలబ్బా!" గొణిగాడు తనలో తానే.

..................

చిత్రం పూర్తిఅయింది. యజ్ఞం పూర్తిచేసినట్టు నవ్వాడు సఫలీకృతంగా. ఆనవ్వులోనే అతని జీవితార్థం యిమిడి వుంది.

బయట కఠోరకంఠా లధిక మైనాయి. దానితో మిళితమై స్త్రీకంఠమూను.

మూలగా చిత్రాన్ని గోడకు ఆనించాడు. పడక

గదిలోనికి వెళ్లాడు...రంగుదారాలతో కమలిని అల్లిన పటం గాలికి గలగలలాడుతూనే వుంది.

వచ్చి తలుపు తీశాడు. గుండె చెరువులుగా యేడుస్తున్నది శాంత. ఎర్రటోపీ లెదురుగా నుంచున్నారు.

"ఏయ్...మరీ దొంగవైనావే...తలుపు తియ్యవేం! ఇల్లు సోదా చెయ్యాలి!"

"అల్లాగే"

శాంత అడ్డుపోబోయింది:

"అత నేం తప్పు చేశాడనీ!"

"కాదు. నీకు తెలీదు—రండి బాబూ. నేనే చేసింది"

అది అరుణుని తీవ్రకంఠం! అప్పటి అతని వాలకం చూస్తూ పులిని చూచినట్లు బెదిరింది శాంత. ఏమిటీ ఆత్మబలి!

తలుపు లన్నీ బార్లా తెరిచారు వారు. పెట్టె లన్నీ బయట విసిరారు. ఇల్లంతా బీభత్సం చేశారు. కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు మూలనుంచి వొక తీగల కట్టా, కొన్ని సుత్తెలూ, రెండుమూడు యినుప ముక్కలూ బయట వేశారు. అరుణుని మిత్రుడు దాచిన బవేకాబోలు-మరొక పుస్తకాల కట్టకూడా.

"యివే..నడు స్టేషనుకు"

"అల్లాగే, పదండి. వుత్తరం వ్రాసి వస్తా"

ఏడుస్తూన్న శాంత నతడు ఓదార్ప ప్రయత్నించనే లేదు!

"...అమ్మా! మీ ఋణం తీర్చుకోలేకపోయాను. అర్థంలేని ఆశయాలతో నాజీవితం పాడుచేసుకుని మీ బ్రతుకులకు చిచ్చు పెట్టాను...క్షమించరూ.. కమలిని పోయిన సంగతి మీకు తెలిసేవుంటుంది. తండ్రిగారికి దిగులు వద్దని చెప్పాలి. చెల్లాయికి నాముద్దులు... ఎక్కడికి పోతున్నానో నాకే తెలీదు. వస్తా...మీ అరూ"

అతని కెన్ని వర్షాలో శిక్ష విధించిన ట్టుంది. చేసిన తప్పు యిప్పటికీ గ్రహించుకోలే దరుణుడు! వ్రాసిన వుత్తరం ఎక్కడికి చేరుతుందీ! పిచ్చివాడు! తండ్రి మరణించిన విషయంకూడా తెలియదు. తిరిగి వచ్చిన తిరుగుటపాకుకూడా అందుకునేవారు లే రిప్పుడా వుత్తరాన్ని.

కొండంత దుఃఖంతో చూడవచ్చా రావూరి ప్రజ. శాంత ఎక్కిళ్లుపెడ్తూ ఏడుస్తూంటే కృష్ణదాసుగారూ, క్షీరసాగరంగారూ చూడలేకపోయినారు. రామూ, రోహిణీ కాలుకాలిన పిల్లిలా బయటికీ, లోపలికీ తిరుగుతున్నారు.

"అక్కా ... యిదుగో కమలిని చిత్రం!" శాంత చూచింది. ప్రతిబింబం!! చివరసారిగా అరుణుడు గీచిన చిత్రం అది.

"అబ్బా! ఈకనరు కంపేమిటీ!"

మిగిలిన అన్నింటినీ అతడు బూడిదచేశాడు.